# ఆంజనేయులు కథ

— జానకీ జాని

ఆతనలా ఉంటాడని ఊహించి తల్లిదండ్రులాపేరు పెట్టారో, లేక పేరుకి తగ్గట్లు అతను నడుచుకుంటున్నాడో నేను చెప్పలేను కాని, ఆంజనేయులు మాత్రం పేరుకితగ్గ మనిషి ఇలా అనటంలో ఆంజనేయులు రూపాన్ని నేను ధ్వనించటంలేదు. కేవలం అతని స్వభావాన్నీ, ప్రవర్తననీ తెలియజెయ్యడమే నా ఉద్దేశం

ఆంజనేయులు ఆర్ట్సు కాలేజీలో ట్యూటరు. అందులోనూ తెలుగు ట్యూటరు. చిన్నయసూరితోనూ, కవిత్రయంతోనూ అట్టే పరిచయం లేకపోయినా, ఏదో ఒక విధంగా నలుగుర్నీ సంతృప్తి పరుస్తూ తనపని తాను చేసుకుపోగల వినయమూ, అణకువా అతనికున్నాయి, ఒక విధంగా చూస్తే ఇవే అతన్ని అనేక సందర్భాలలో కష్టాల నుంచి రక్షించాయి.

"ఆంజనేయులు వట్టి అమాయకుడు" - ఇది తన మిత్రులనుకొనేవారు. అతనికిచ్చిన సర్టిఫికెట్టు.

"ఆంజనేయిలు నోట్లో వేలు పెడితే కరవలేని వాడేంకాదు. బ్రతుకు తెరువు అతనికి తెలిసినంతగా మనకు తెలియనే తెలియదు." ఇది వంటరిగా ఉన్నప్పుడు స్వగతంలోనూ, ఆంజనేయులు లేనప్పుడు స్టాఫ్ రూమ్‌లో ప్రకాశంగానూ ఇతర ట్యూటర్లు అనేమాట.

ఆంజనేయులులో ఉన్న ఇంకో సుగుణం ఇతరులతో వాద ప్రతివాదాలలోకి దిగకుండా వుండడం. ఎవరు ఏ విషయం చెప్పినా వెంటనే అతను అంగీకరిస్తాడు. ఆంజనేయులుకి ఏ విధమైన పక్షపాతం లేదుసరిగదా మనుష్యుల్లో అరుదుగా కనుపించే హృదయ వైశాల్యంకూడా వుంది. ఎప్పుడైనా ఇద్దరు వ్యక్తులు కలహించుకొని తమ

దెబ్బలాటకి కారణం ఆంజనేయులుతో చెబితే, అతను ఆ ఇద్దరి అభిప్రాయాలతోనూ ఏకీభవించగలడు.

ఇదంతా ఆంజనేయులు కథకి ఉపోద్ఘాతంమాత్రమే. బెర్నార్డ్‌షా నాటకాలలోలాగా ఆంజనేయులు కథలో కూడా, కథ ఎంతముఖ్యమో ఉపోద్ఘాతమూ అంతే ముఖ్యం.

ఆంజనేయులుతో నాకు పరిచయం అనుకోకుండా జరిగింది. అవి నేను బెజవాడలో లెక్చరర్‌గా పని చేసేరోజులు. ఒకరోజున ప్రిన్సిపాల్ నాకోసం కబురు చెయ్యటంతో నేను ఆయనను కలుసుకోవటానికి ఆఫీసుకు వెళ్లాను. అక్కడ ఆంజనేయులు కూర్చుని ఉన్నాడు అప్పటికి కొన్ని నిమిషాల క్రితమే ఆంజనేయులు మా కాలేజీలో ట్యూటరుగా అప్పాయింటయాడు. సహజంగా చాలా కాలేజీలలో ఒకక్లాసు లెక్చరర్‌కీ, ఆ క్లాసుకాంపొజిషన్ పుస్తకాలుదిద్దేట్యూటరుకీ ఒక విధమైన లంకిక ఉంటుంది. ఆంజనేయులు మాటల్లో చెప్పాలంటే అతని అదృష్టవశాత్తూ, అతనికీ నాకు అలాంటిబంధంప ్పడింది. ఉద్యోగంలో చేరటాని ముందు, ప్రిన్సిపాల్ నన్ను అతనికి పరిచయం చేసి విధి నిర్వహణని గురించి అతనికి ఒక ముఖ్యమైన సలహా ఇచ్చాడు బాగా శ్రమించి పని చేయాలనీ, అతని ఉద్యోగం ఖాయం కావడం సంవత్సరంచివర నే నిచ్చే రిపోర్టు మీద ఆధారపడి ఉంటు ందనీ దాని సారాంశం. ఇది ఆంజనేయులు మనస్సులో బాగా నాటుకు పోయింది.

ఇదిజరిగినప్పటినుంచీ అతనునిజంగా ఆంజనేయుతే అయాడు. నేను ఎప్పుడు ఎక్కడ కనబడ్డా అతను అమాంత కంగారుపడిపోయి ఎక్కడలేని వినయమూ ప్రదర్శిస్తూ వుండేవాడు. ఖర్మం చాలక అతను సైకిలుమీద పోతున్నప్పుడు నేను కనబడితే ఏక్సిడెంట్ జరిగితే కంగారుతోనూ భయంతోనూ దిగినట్లుగా సైకిలు మీదనుంచి ఒక్క ఉరుకుతో కింద పడే కొన్ని సందర్భాలలో కంగారుతో సైకిలు ఎక్కడ మీదకు పోనిస్తాడోనని నాకు భయంకూడా కలుగుతూ ఉండేది. ఇక కాలేజి కాంటీన్ సంగతి చెప్పనే అక్కర్లేదు. నేను కేంటీన్‌లో ప్రవేశించిన దగ్గర్నుంచీ వెళ్ళిపోయే వరకూ అతను నిలబడే ఉండేవాడు. ఒక్కొక్కప్పుడు అతని ప్రవర్తన చూసి, నాకు నవ్వు వచ్చేది. ఎన్నోసార్లు నేను అతన్ని ఈ విషయాన్నిగూర్చి హెచ్చరించాను.

"చూడండి ఆంజనేయులుగారూ, మీరు వయస్సులో నాకంటె పదేళ్ళ పెద్దవారు. ఏదో లెక్చరర్ నైనంతమాత్రాన మీరు నన్ను అంతగా గౌరవించటం బాగుండదు."

ఈ సలహాలూ, హెచ్చరికలూ ఆంజనేయులులో ఎలాంటి మార్పుతేలేదు సరిగదా, వేసవికాలం దగ్గర పడుతున్నకొద్దీ అతను మరింతగా భక్తి ప్రపత్తులు ప్రదర్శించసాగాడు. అతని హృదయాన్ని తేలికగా అర్థంచేసుకున్న నేను, అతన్ని గురించి బాగానే వ్రాస్తాననీ, అతని ప్రొబేషన్ పూర్తవటం ఉద్యోగం ఖాయం కావడం తథ్యమనీ చెప్పాను.

ఈ మాటలు ఆంజనేయుల్ని ఏనుగు నెక్కించాయి. నా సహృదయతని ఎంతగానో మెచ్చుకుంటూ, "చాలాకాలం నేను సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేశాను మేస్టారూ! స్కూల్ ఫైనల్ దగ్గరనుంచీ బి.యే దాకా—అంతా ప్రయివేటుగానే చదివాను. ఇంటిదగ్గర పెద్ద సంసారం. ముసలి తల్లిదండ్రులు. ఏదో మీ దయ వల్ల ఈ ఉద్యోగం ఖాయమైతే, నేను జీవితంలో ఆశించేది ఇంతకంటె ఏమీ ఉండదు" అన్నాడు.

ఆంజనేయులు నమ్రతా, భక్తి ప్రపత్తులూ, పదేళ్ళు జరిగిపోయినా ఈనాటికీ నాకు ఆశ్చర్యం కలిగిస్తాయి. అసలు ఆంజనేయులు మన సమాజంలో అల్ప సంతోషులూ, అమాయకులూ ఐన వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తాడు. జాతీయ అంతర్జాతీయ రంగాల్లో ఎన్ని మార్పులు వచ్చినా' ఇలాంటివారు మాత్రం ఏ మార్పూ లేకుండానే జీవిస్తున్నారు, ఇలాంటి జీవితమే వారికి ఆనందం కలిగిస్తుందేమో ననిపిస్తుంది నాకు.

ఇంకో వారం రోజుల్లో వేసవి సెలవలిస్తారనగా ఆంజనేయులు మా ఇంటికి వచ్చాడు. అతని ముఖ కవళికల్ని బట్టి అతనేదో సమస్యను ఎదుర్కొంటున్నట్టు నేను అర్థం చేసుకున్నాను. నన్ను వాళ్ళింటికి భోజనానికి పిలవటానికి, వచ్చాననీ, అలా పిలవటం సాహసమైతే క్షమించమనీ, అతనన్నప్పుడు నాకు ఆశ్చర్యంతోపాటు నవ్వుకూడా వచ్చింది. అతని ఆహ్వానాన్ని "మన్నించడం" నా దృష్టిలో సర్వసామాన్యమైన విషయమే ఐనా, అది అతన్ని గౌరవించటమేనని అతని భావన. నేను అంగీకరించడంతో అపరిమితమైన ఆనందాన్ని పొందింది, నన్ను తీసుకు వెళ్ళటానికి రాత్రి ఏడు గంటలకు వస్తానని చెప్పి ఆంజనేయులునా దగ్గిర సెలవుతీసుకున్నాడు.

అన్నమాట ప్రకారం సరిగ్గా ఏడు గంటలకు ఆంజనేయులు రెండు రిక్షాలు తీసుకునిమా ఇంటిదగ్గరిప్రత్యక్షమయ్యాడు ఒకేరిక్షాలో నాపక్కన కూర్చుని నన్ను అగౌరవ పరచటం ఇష్టంలేక రెండు రిక్షాలు తెచ్చినట్లు నేను అతని మాటల వల్ల అర్థంచేసుకున్నాను. అక్కడికి ఆంజనేయులు నన్ను మరీ ఎక్కువగా గౌరవించకుండా వదలి పెట్టినట్లు సంతోషించాను. కారణం ఒక రిక్షాతెచ్చి తాను కిందకూర్చుంటాననో, లేక రిక్షా వెనకనే నడచి (పరుగెత్తి) వస్తాననో అతను అనక పోవటమే.

ఆంజనేయులు ఇంటిదగ్గర నాకు ఒక మంత్రికో, సినిమానటుడుకో జరిగినంత మర్యాద జరిగింది. అతని కుటుంబ సభ్యులందర్నీ, ఒకరి తరువాత ఒకర్ని ఆంజనేయులునాకు పరిచయం చేశాడు. వారంతా నా మంచితనాన్నీ, సహృదయతనీ శ్లాఘించటం ప్రారంభించారు. ఇన్నేళ్ళు గడచిపోయినా, ఆదృశ్యం తల్చుకుంటే ఇప్పటికీ నాకు ఆశ్చర్యం వేస్తుంది. ఆంజనేయులు పిల్లలు కామోలు, నేను వాళ్ళింట్లో ఉన్న ఆకాస్త సేపూ బందీలుగా మారి జైలు జీవితం అనుభవించారు. ఆ వాతావరణమూ ఆ ఇంట్లో


ప్రతి ఒక్కరూ ఒక ఆంజనేయులుగా మారటమూ, నాకు ఆశ్చర్యంతో బాటు అయిష్టతనికూడా కలిగించాయి.

భోజనం అవుతూ ఉండగా, కృతజ్ఞతాపూర్వకంగా నేనే సంభాషణ ప్రారంభించాను. "ఎందుకండీ ఇంత శ్రమ తీసుకుని ఇన్ని పదార్థాలు చేయించారు? మామూలుగా పోనిస్తేసరి పోయేదిగదా!"

నామాటలు ఆంజనేయులుకి బాగా సంతృప్తి కలిగించాయి. ఆ విషయం నాకుస్పష్టంగా అతని కళ్ళల్లో కనపించింది ఆంజనేయులు ఇంకా ఆనందాన్నుంచి తేరుకోక పూర్వమే అతని తండ్రి సంభాషణ ప్రారంభించాడు.

"ఎంతమాట సెలవిచ్చారు! ఇవాళ ఇలా మేము భోజనం చేస్తూన్నామంటే ఇదంతా మీచలవకదా? మేం మీకు పెట్టింది మాత్రం ఏముంది? ఈ అన్నం మీది. ఈ పదార్థాలుమీవి. అసలు తమ వంటివారు ఇలా దయచేయటం మా పూర్వజన్మ సుకృతం.....

ఆయన ఇలా చెప్పుకుపోతున్నాడు. అదంతా వింటున్న నాకు ఎక్కడో ఇంకో ప్రపంచంలో ఉన్నట్లు అనిపించింది. ఆయన చెప్పిచెప్పి, "ప్రభువులు చిత్తగిస్తే ఒక్క మనవి" అన్నాడు. "చిత్తగించటం" — "ప్రభువులు" "మనవి" నాకు బొత్తిగా గిట్టనిమాటలు. ఇంకెంతమాత్రం ఆ రకమైన సంభాషణ



వినటం ఇష్టం లేక, ఆంజనేయులు ఉద్యోగం ఖాయం అవుతుందనీ, నేను చాలా అనుకూలంగా రాశాననీ చెప్పాను. నా మాటలు వారి హృదయాలలో వున్న అసందిగ్ధపు చీకటిని తొలగించి ఒక కోటి కృతజ్ఞతా జ్యోతుల్ని వెలిగించాయి. ఆ వెలుగు ప్రతిబింబం నాకు వాళ్ళ కళ్ళల్లో స్పష్టంగా కనబడింది.

నేను వారిదగ్గర సెలవు తీసుకుని బయటకు వచ్చేటప్పటికి, మమ్మల్ని తీసుకు వచ్చిన రెండురిక్షాలు ఇంకా అక్కడే ఉండటంనాకు కనుపించింది. నేనేమీ మాట్లాడక పూర్వమే ఆంజనేయులు, "ఇక్కడ రిక్షాలు చప్పున దొరకవు మాస్టారూ. కొం దూరం నడిచి వెళ్ళాలి. మిమ్మల్ని శ్రమపెట్టడం ఇష్టం లేక మనం వచ్చిన రిక్షాలనే ఉంచేశాను." అన్నాడు.

ఆంజనేయులు నిజంగా పరేంగితజ్ఞుడు. ఇది జరిగిన కొన్నాళ్ళకే ఆంజనేయులు ఉద్యోగం ఖాయం కావడమూ మరో పైఉద్యోగం దొరికి నేను విజయవాడ వదలి పెట్టడమూ జరిగాయి. ఆంజనేయులు ప్రవర్తనని అనేకులు అనేక విధాలుగా వ్యాఖ్యానించారు. చాలామంది ఆంజనేయులుకు పని ఎలా చేయించుకోవాలో తెలుసుననీ, అమాయకుడేమీ కాడనీ అభిప్రాయం వెలిబుచ్చారు, మరి కొందరు, నేనుకొన్నాళ్ళు పోయాక విజయవాడ వెళ్ళి ఆంజనేయులిని కలుసుకుంటే అప్పుడెలా రిసీవ్ చేసుకుంటాడో చూస్తే అతని అసలు తత్వం బయటపడుతుందన్నారు. ఏమైనా నేను అల్లాంటిదేమీ చేయలేదు. కాల క్రమాన నేను ఇతరవ్యవహారాలల్లో పడి ఆంజనేయులు విషయం మరచిపోయాను. పదేళ్ళ తరువాత నాకు ఆంజనేయులు దగ్గిర్నించి ఉత్తరం వచ్చింది. తాను ప్రయివేటుగా యమ్. ఏ ప్యాసై లెక్చరర్‌గా ప్రమోషన్ సంపాదించాననీ, అతని అభివృద్ధికి అప్పట్లో నేను అనుకూలంగా రాయటమే కారణమనీ కృతజ్ఞత తెలుపుకోవటమే కాక, వీలుజూసుకుని విజయవాడ వచ్చి ఒక రోజు వారింట్లో గడిపితే సంతోషిస్తానని వ్రాశాడు

ఈ వుత్తరం వ్యక్తిగా ఆంజనేయుల్ని అత్యున్నత స్థానంలో నిలపెట్టింది, అప్పట్నుంచీ కృతజ్ఞత, వినయం, నమ్రత మొదలైన గుణాలను గురించి ఎవరు మాట్లాడినా, నా మనస్సులో ఒక్కసారి ఆంజనేయులి రూపమే మెదుల్తుంది.